సాక్షి
కుమురం భీం
బుధవారం, 14, ఆగస్టు, 2024



రావమ్మా.. మహాలక్ష్మి
ఈ నెల 14 నుంచి 19 వరకు వరుస సెలవులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని డిపోల నుంచి ప్రధాన రూట్లలో ఆర్టీసీ అదనపు బస్సులు నడవనుంది. 8లో▸



విచ్చలవిడిగా 'దేశీ' దుకాణాలు
జిల్లాలో దేశీదారు మద్యం విక్రయాల కోసం ప్రత్యేకంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. తక్కువ ధరకు లభించే ఈ మద్యానికి ప్రజలు బానిసలవుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.4 /26.6

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రకాశ్

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించనున్న స్వాతంత్య్ర వేడుకలకు తెలంగాణ లెజిస్లేటివ్‌ కౌన్సిల్‌ డిప్యూటీ చైర్మన్‌ బండ ప్రకాశ్‌ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని 32 జిల్లాల్లో నిర్వహించే పంద్రాగస్టు వేడుకలకు ముఖ్య అతిథులను ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బండ ప్రకాశ్‌ జిల్లా కేంద్రంలో ఈ నెల 15న జాతీయ జెండా ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొననున్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌: అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉపాధ్యాయులను వేధిస్తున్న ఆసిఫాబాద్‌ మండలంలోని బూర్గుడ స్కూల్‌ కాంప్లెక్స్‌ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌(టీయూటీఎఫ్‌) నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీఈవో అశోక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల సదాశివ్‌ మాట్లాడుతూ బూర్గుడ హెచ్‌ఎం కక్షపూరితంగా ఉపాధ్యాయులను వేధిస్తున్నారని ఆరోపించారు. సరెండర్‌ లీవ్‌, లోన్ల మంజూరులో కాలయాపన చేస్తున్నారన్నారు. బూర్గుడలో ఎస్‌ఏగా విధులు నిర్వర్తిస్తూ విరమణ పొందిన సత్యనారాయణ మెడికల్‌ రీయింబర్స్‌మెంట్‌ బిల్లులు ఫిబ్రవరి నుంచి నేటి వరకు సంబంధిత శాఖకు ఫార్వర్డ్‌ చేయలేదని పేర్కొన్నారు. సదరు ప్రధానోపాధ్యాయుడిపై విచారణ జరిపి ఈ నెల 19లోగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో ఈ నెల 19 నుంచి ధర్నా చేపడతామన్నారు. నాయకులు వెంకట్రావు, శంకర్‌, కృష్ణమూర్తి, మహేశ్‌, ఉపాధ్యాయులు ఉన్నారు.

'సీజనల్‌ వ్యాధులపై ఆందోళన వద్దు'

ఆసిఫాబాద్‌: సీజనల్‌ వ్యాధులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సీజనల్‌ వ్యాధుల కట్టడికి అధికార యంత్రాంగం అహర్నిశలు పని చేస్తుందని పేర్కొన్నారు. గుండాయిపేటలో డెంగీతో రెండు మరణాలు సంభవించాయని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గుండాయిపేటలో ఈ నెల 11 నుంచి ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఈ నెల 16 నుంచి వైద్యశిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



ప్లాస్టిక్‌ వ్యర్థాలు సేకరిస్తున్న అధికారులు

సిర్పూర్‌(టి): అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని సిర్పూర్‌(టి) రేంజ్‌ అధికారి ఇక్బాల్‌ హుస్సేన్‌ అన్నారు. సిర్పూర్‌(టి), కాగజ్‌నగర్‌ ప్రధాన రహదారిలోని పెద్దబండ సమీపంలో గల భీమన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో మంగళవారం అటవీశాఖ అధికారులు ప్లాస్టిక్‌, వ్యర్థ పదార్థాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో వన్యప్రాణులకు నష్టం జరుగుతుందన్నారు. అటవీ ప్రాంతంలోని భీమన్న ఆలయ పరిసరాల్లో భక్తులు ప్లాస్టిక్‌, ఇతర వ్యర్థ పదార్థాలు వదిలేయొద్దని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్‌ అధికారులు ప్రవీణ్‌కుమార్‌, శ్రీధరాచారి, సెక్షన్‌ అధికారులు మోహన్‌రావు, తులసీదాస్‌నాయక్‌, తిరుపతినాయక్‌, ఎఫ్‌బీవోలు, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి, అనంతరం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఫౌండేషన్‌కు అప్పగించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాయ, విజయ, పద్మ, లక్ష్మి, ఈశ్వరీ, పోసవ్వ, భూమక్క, రాజేశ్వరి, నిర్మల, స్వరూప, స్వప్న పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌ దొంగలు!



బెజ్జూర్‌ మండలంలో ఇటీవల 'దేటామీర్‌' అనే యాప్‌లో చాలా మంది రూ.లక్షలు పెట్టి మోసపోయారు. పెట్టుబడికి రెట్టింపు నగదు వస్తుందని ప్రచారం కావడంతో బెజ్జూర్‌, కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్‌(టి) మండలాల్లో యువతీ యువకులు రూ.వేల నుంచి రూ.లక్షల వరకు యాప్‌లో జమ చేశారు. కొన్నిరోజుల తర్వాత డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో బాధితులు సైబర్‌ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

జూలై 29న లింగాపూర్‌ మండలం వంజారీగూడలోని ఓ రైతుకు స్థానిక గ్రామ పంచాయతీ పేరిట ఉన్న వాట్సాప్‌ గ్రూప్‌లో తెలిసిన వారి నంబర్‌ నుంచి 'పీఎం కిసాన్‌ రిజిస్ట్రేషన్‌ –2024' పేరిట లింక్‌ వచ్చింది. సదరు రైతు లింక్‌పై క్లిక్‌ చేయడంతో వెంటనే అతడి ఖాతా నుంచి రూ.5వేలు విత్‌డ్రా అయినట్లు సందేశం వచ్చింది. అనంతరం మరో రూ.10 వేల నగదు కూడా విత్‌డ్రా అయినట్లు సందేశం రావడంతో బాధితుడు బ్యాంకు అధికారులను సంప్రదించాడు. అధికారులు బ్యాంక్‌ ఖాతా స్తంభింపజేయగా.. రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- రుణమాఫీ వేళ లింకుల గోల
- క్లిక్‌ చేస్తే అంతే సంగతులు
- ఈ ఏడాది ఇప్పటివరకు 252 సైబర్‌ నేరాలు
- అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసుల సూచన

కౌటాల(సిర్పూర్‌): డిజిటల్‌ లావాదేవీలు పెరుగుతుండటంతో సైబర్‌ నేరాలూ పెరుగుతున్నాయి. చిరువ్యాపారులు, కూలీలు, రైతులు, కార్మికులు బ్యాంకు ఖాతాల్లో దాచుకుంటున్న సొమ్మును 'ఆన్‌లైన్‌' నేరగాళ్లు కాజేస్తున్నారు. అమాయకులకు మాయమాటలు చెబుతూ.. ఆన్‌లైన్‌ ద్వారా లింకులు పంపిస్తూ క్షణాల్లో నగదు మాయం చేస్తున్నారు. తక్షణం స్పందించి ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీకి అవకాశం ఉన్నా అవగాహన లేక చాలామంది నష్టపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 252 సైబర్‌ క్రైం కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ నగదు జమ చేస్తున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

నమ్మిస్తూ.. బెదిరిస్తూ

విలాసాలకు అలవాటు పడినవారు.. సులభంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో కొందరు ఆన్‌లైన్‌ మోసాలకు పాల్పడుతున్నారు. యూట్యూబ్‌ ఇతర వెబ్‌సైట్ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుని అమాయకుల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

- రుణం మంజూరైందని కొందరు ఖాతాదారులను నమ్మించి బ్యాంక్‌ అకౌంట్‌ వివరాలు తీసుకుంటున్నారు. బాధితుల ఖాతాల్లోని సొమ్ము కాజేస్తున్నారు.
- నిరాక్షరాస్యులు, అవగాహన లేనివారికి మెసేజ్‌ల ద్వారా లింకులు పంపించి సొమ్ము దోచుకుంటున్నారు.
- లాటరీ వచ్చిందని ఫోన్లు చేసి నగదు బహుమతి అందుకునేందుకు ఖర్చుల కింద కొంత నగదు జమ చేయాలంటూ మాయమాటలు చెబుతుంటారు.
- ప్రస్తుతం రైతులకు రుణమాఫీ డబ్బులు ప్రభుత్వం బ్యాంక్‌ ఖాతాల్లో జమ చేస్తుంది. సైబర్‌ నేరగాళ్లు రైతుల ఫోన్లకు ఫేక్‌ లింక్‌లు పంపిస్తూ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.
- ట్విట్టర్‌(ఎక్స్‌), ఫేస్‌బుక్‌, యూట్యూబ్‌, ఇన్‌స్టాగామ్‌ తదితర సోషల్‌ మీడియాలో ఫొటోలు సేకరించి మార్ఫింగ్‌ చేస్తున్నారు. అసభ్యకరంగా చిత్రీకరించి సదరు వ్యక్తులను బ్లాక్‌మెయిల్‌ చేస్తున్నారు. ఫేక్‌ ప్రొఫైల్స్‌ సృష్టిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.
- ఇక వాట్సాప్‌లో గుర్తు తెలియని నంబర్లతో న్యూడ్‌ వీడియో కాల్స్‌ చేస్తూ రికార్డు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు.
- సైబర్‌ నేరగాళ్ల చేతిలో మోసపోతున్న వారిలో విద్యావంతులతోపాటు సోషల్‌ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారే అధికంగా ఉంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నా..

జిల్లాలోని మారుమూల మండలాలు బెజ్జూర్‌, చింతలమానెపల్లి, లింగాపూర్‌, జైనూర్‌, సిర్పూర్‌(యూ), తిర్యాణి తదితర ప్రాంతాల్లోని ప్రజలకు సైబర్‌ నేరాలపై పూర్తిస్థాయి అవగాహన ఉండటం లేదు. పోలీస్‌ శాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా కొత్త కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఫిర్యాదులు పెరుగుతుండటంతో ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌ను సైబర్‌ వారియర్స్‌గా నియమించారు. బాధితులు మోసపోయిన వెంటనే సైబర్‌ వారియర్స్‌ను సంప్రదించడంతోపాటు 1930 నంబర్‌తోపాటు https://cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు. నేరాలు జరుగుతున్న తీరు, నేరగాళ్లు అనుసరిస్తున్న విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక బృందాలతో అవగాహన కల్పిస్తున్నారు.

నకిలీ యాప్స్‌తో పేమెంట్లు

- గ్రామాల్లోనూ పెరిగిన క్యాష్‌లెస్‌ పేమెంట్లు
- అన్ని దుకాణాల్లో క్యూఆర్‌ కోడ్‌ స్కానర్లు
- నకిలీ యాప్‌లు వినియోగిస్తూ చెల్లింపులు చేస్తున్న మోసగాళ్లు

రెబ్బెన మండలం గోలేటికి చెందిన చీరల వ్యాపారి వద్దకు ఇటీవల ఇద్దరు వ్యక్తులు వచ్చి రూ.4 వేల విలువైన దుస్తులు కొనుగోలు చేశారు. నగదు లేదని చెప్పి మరో రూ.7వేలు డబ్బులు తీసుకుని సదరు వ్యాపారికి ఫేక్‌యాప్‌ ద్వారా పేమెంట్‌ చేశారు. ఖాతాలో డబ్బులు జమ కాలేదని వ్యాపారి ప్రశ్నించగా.. సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతుందని చెప్పారు. ఫేక్‌యాప్‌ ద్వారా నగదు పంపిన మెసేజ్‌ చూపి అక్కడి నుంచి జారుకున్నారు. రోజులు గడుస్తున్నా నగదు జమ కాకపోవడంతో వ్యాపారి మోసపోయానని గుర్తించాడు. ఇలా.. జిల్లాలో పలువురు కేటుగాళ్లు ఫేక్‌ యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్నారు.

తిర్యాణి(ఆసిఫాబాద్‌): పెద్దనోట్ల రద్దు తర్వాత డిజిటల్‌ చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కల్పించడంతో గ్రామాల్లో నగదు రహిత లావాదేవీలు పెరిగాయి. ఆన్‌లైన్‌ పేమెంట్‌ యాప్‌లకు సంబంధించిన సంస్థల ప్రతినిధులే మారుమూల గ్రామాల్లో తిరుగుతూ పోటీపడి షాపులకు క్యూఆర్‌ కోడ్‌ స్కానర్లు అందించారు. అలాగే రుణాలు కూడా మంజూరు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకు 10 నుంచి 20 శాతం ఉన్న ఆన్‌లైన్‌ చెల్లింపులు ప్రస్తుతం 60శాతం వరకు పెరిగినట్లు అంచనా.. అయితే ఆన్‌లైన్‌ లావాదేవీలు పెరిగిన తరుణంలో మోసాలు కూడా అదే రీతిన పెరుగుతున్నాయి.

నకిలీ యాప్‌లు ఇన్‌స్టాల్‌ చేసుకుని..

ఆర్టీసీ సంస్థ నుంచి గ్రామాల్లోనూ నగదు రహిత చెల్లింపులు పెరిగాయి. దీనిని ఆసరా తీసుకుని కొంతమంది అక్రమార్కులు నకిలీ ఆన్‌లైన్‌ యాప్‌లను తమ ఫోన్లలో ఇన్‌స్టాల్‌ చేసుకుంటున్నారు. ఈ యాప్‌లు నిజమైన పేమెంట్‌/యూపీఐ యాప్‌లను పోలి ఉంటున్నాయి. చెల్లింపులకు సంబంధించి ఐడీ కూడా కనిపిస్తుంది. దీంతో నిత్యం రద్దీగా ఉంటే షాపుల యజమానులు సులువుగా మోసపోతున్నారు. ఇలాంటి మోసాలపై చిరువ్యాపారులు, యజమానులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. పేమెంట్‌ చేసిన ప్రతిసారి అకౌంట్లలో నగదు జమ అయ్యిందో లేదో గమనించాలి. ఎవరైనా నకిలీ యాప్‌లు వాడుతున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.



అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో సైబర్‌ నేరాలు పెరుగుతున్నాయి. రైతులు ఫోన్లకు వచ్చే లింక్‌లు ఓపెన్‌ చేయొద్దు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పొద్దు. నగదు పోగొట్టుకుంటే వెంటనే స్థానిక పోలీస్‌ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి. సైబర్‌క్రైం హెల్ప్‌లైన్‌ 1930 నంబర్‌కు సమాచారం అందించాలి. సంబంధిత ఖాతా నుంచి నగదు విత్‌డ్రా కాకుండా చూస్తారు. రుణ మాఫీ నేపథ్యంలో ఇప్పటికే రైతులను అప్రమత్తం చేశాం. బ్యాంక్‌ నుంచి ఖాతాదారులకు ఎవరూ ఫోన్‌ చేసి వివరాలు అడగరు. రాష్ట్రంలో లాటరీ విధానం నిషేధంలో ఉన్నందున మీకు లాటరీ వచ్చిందని ఎవరూ ఫోన్‌ చేసినా స్పందించొద్దు.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

ప్రజా సంక్షేమానికి కృషి చేయాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్‌

ఆసిఫాబాద్‌: ప్రజా సంక్షేమానికి అధికార యంత్రాంగం కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి రాజీవ్‌సింగ్‌ అన్నారు. కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురం నుంచి మంగళవారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో వెనుకబడిన జిల్లాల్లో ప్రధానమంత్రి గతిశక్తి కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధనకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నీతి ఆయోగ్‌, ప్రధానమంత్రి జన్‌మన్‌, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ నుంచి అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధానమంత్రి గతిశక్తి ద్వారా స్థానిక గిరిజనుల అభివృద్ధి, నీతి ఆయోగ్‌ ద్వారా మారుమూల గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌, ర్యాగింగ్‌ నేరం



మాట్లాడుతున్న జడ్జి యువరాజ్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): ఈవ్‌ టీజింగ్‌, ర్యాగింగ్‌ చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జి యువరాజ్‌ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మంగళవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ ప్రకాశ్‌ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్‌ సివిల్‌ జడ్జి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం కళాశాల సిబ్బంది సీనియర్‌ సివిల్‌ జడ్జిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెండర్‌ స్పెషలిస్టు రాణి, అడ్వకేట్లు శ్రీదేవి, వెంకటేశ్వర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్‌ పోతే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌: మొబైల్‌ ఫోన్‌ పోగొట్టుకుంటే ఆందోళన చెందకుండా వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు వారి మొబైల్‌ ఫోన్లు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు రూ.6 లక్షల విలువైన ఫోన్లు బాధితులకు అందించామని తెలిపారు. చోరీకి గురైన మొబైల్స్‌ తిరిగి పొందడానికి సీఈఐఆర్‌ పోర్టల్‌లో వినియోగదారులు వివరాలు నమోదు చేసుకుంటే సులభంగా స్వాధీనం చేసుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 183 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. చోరీకి గురైన ఫోన్లలో వ్యక్తిగత సమాచారం ఉంటే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందన్నారు. ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలిగిస్తుందని, దొంగిలించిన ఫోన్లతో నేరాలకు పాల్పడే అవకాశం కూడా ఉంటుందన్నారు. అలాగే సెకండ్‌ హ్యాండ్‌ ఫోన్‌ కొనే ముందు అప్లికేషన్‌లో ఫోన్‌ వివరాలు, ఐఎంఈఐ నంబర్లతో చెక్‌ చేసుకోవాలని సూచించారు.



బాధితుడికి మొబైల్‌ అందిస్తున్న ఎస్పీ, చిత్రంలో పోలీసులు రికవరీ చేసిన ఫోన్లు

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే మెసేజ్‌లు, లింక్‌లు ఓపెన్‌ చేయొద్దని సూచించారు. బహుమతులు, లాటరీలు వచ్చాయని, ఉద్యోగాలు ఇస్తామని చెప్పినా నమ్మొద్దన్నారు. బ్యాంక్‌ అకౌంట్‌ సీజ్‌ అయిందని, ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దన్నారు. సైబర్‌ మోసానికి గురైతే వెంటనే 1930కి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఎస్బీ సీఐ రాణాప్రతాప్‌, ఐటీ కోర్‌ సిబ్బంది శ్రీను, మారుతి, అఖిల పాల్గొన్నారు.

బాధితులకు వేగంగా న్యాయం జరగాలి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఎస్పీ సదయ్య అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. స్టేషన్‌ రికార్డులతోపాటు పరిసరాలు, కిట్‌ ఆర్టికల్స్‌, పార్కింగ్‌ ప్రదేశాలు, రిసెప్షన్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. రోజువారీగా నిర్వహిస్తున్న జనరల్‌ డైరీ, బీట్‌ డ్యూటీ బుక్స్‌, సుపీరియర్‌ ఆఫీసర్స్‌ విజిటింగ్‌ బుక్స్‌ తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌ పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బందికి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డయల్‌ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలన్నారు. సంఘటన స్థలికి చేరుకుని సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. తరుచూ గ్రామాలను సందర్శిస్తూ సైబర్‌ నేరాలు, ఆన్‌లైన్‌ మోసాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుల విషయంలో జాప్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రిసెప్షన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ సదయ్య

'స్వచ్ఛదనం– పచ్చదనం' నిరంతరం కొనసాగించాలి

- రాష్ట్ర మంత్రి సీతక్క

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌ నుంచి మంగళవారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, వైద్యారోగ్య, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశం నుంచి అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి.. డీపీవో భిక్షపతి, డీఎంహెచ్‌వో తుకారాం భట్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టిన స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్యాచరణ ప్రకారం కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. అంతర్గత రహదారులు, మురుగుకాలువలు, ట్యాంకులు శుభ్రపర్చడంతోపాటు శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. రహదారులపై గుంతలు పూడ్చి, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటామన్నారు. నిరంతరంగా పారిశుధ్య పనులు చేపట్టడంతోపాటు సీజనల్‌ వ్యాధుల నియంత్రణకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

'రోడ్లు వేయకుండానే బిల్లులు'



రోడ్డు పరిశీలిస్తున్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

సిర్పూర్‌(టి): మండలంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హయాంలో స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి, రోడ్లు వేయకుండానే బిల్లులు కాజేశారని బీఆర్‌ఎస్‌ నేత ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ ఆరోపించారు. మండల కేంద్రంలోని డౌనల్‌ ప్రాంతంలో గల దోబీవాడను స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డౌనల్‌ చౌరస్తా నుంచి దోబీవాడ వరకు రోడ్డు వేయకుండానే గత సర్పంచ్‌ మాజీ ఎమ్మెల్యే అండతో ఎంబీ రికార్డులు లేకున్నా బిల్లులు కాజేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నాయకులు రాజ్‌కుమార్‌, అస్లాంబిన్‌ అహ్మద్‌, మంగీలాల్‌, సల్మాన్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేయాలి



గోలేటిలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్‌ అన్నారు. హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లో 150 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించి జాతీయ గీతం ఆలపించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర పోరాటంలో అమరులైన నాయకులు, వీరులను స్మరించుకోవాలని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు అరికట్టి హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, సింగరేణి పాఠశాల హెచ్‌ఎంలు రవితేజ, సంతోష్‌, పీఈటీ భాస్కర్‌, ఉపాధ్యాయులు బాబునాయక్‌, వేణు, మనోహర్‌, కవిత, పద్మావతి, స్నేహలత, సుమ, కుందారపు నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ సుదర్శన్‌ గౌడ్‌, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, ప్రధాన కార్యదర్శి నవీన్‌ గౌడ్‌, ఓదెలు, నాయకులు సచిన్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

తాండూర్: మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, నలుపు రంగు ఫుల్ షర్ట్, నీలం రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడికాలికి నల్లదారం కట్టి ఉంది. అతను ఏదైనా రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాని, మరే ఇతర కారణంతోనైనా మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే బెల్లంపల్లి రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో వృద్ధురాలి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మండలంలోని దొనబండకు చెందిన రాగుల విమలమ్మ (85) బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. విమలమ్మకు గత రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అనారోగ్యం, వృద్ధాప్యం కారణంగా కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఇంట్లో ఒంటరిగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన విమలమ్మ మంగళవారం ఇంటి వెనకాల ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త భద్రయ్య ఇది వరకే మృతి చెందగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి పెద్ద అల్లుడు గురుచరణం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సూపర్ వాస్మాల్ తాగి వివాహిత ఆత్మహత్య

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన వివాహిత గిరుగులే కల్పన(25) సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కల్పనకు గత 8 ఏళ్ల క్రితం రాజేష్‌తో వివాహం కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సిర్పూర్(టి)కి చెందిన వీరు రెండేళ్ల క్రితం రెబ్బెనకు వలసవచ్చారు. ఇక్కడ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య కుటుంబ కలహాలతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. జీవితంపై విరక్తి చెంది కల్పన సోమవారం ఇంట్లో సూపర్‌వాస్మాల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చంద్రాపూర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజాము మృతిచెందింది.

ఇసుక కుప్పలు సీజ్

రెబ్బెన: మండలంలోని దేవులగూడలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి సీజ్ చేశారు. పక్కా సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా 55 ట్రాక్టర్ల లోడ్, సుమారు 165 క్యూబిక్ మీటర్ల ఇసుకను గుర్తించి సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపారు. పట్టుబడిన ఇసుకను త్వరలో వేలం వేస్తామన్నారు.

రావమ్మా.. మహాలక్ష్మి



- ఈనెల 14 నుంచి 19 వరకు వరుస సెలవులు
- ఉమ్మడి జిల్లా డిపోల నుంచి 129 అదనపు సర్వీసులు

మంచిర్యాలఅర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికులకు టీజీఆర్టీసీ శుభవార్త అందించింది. ఆయా డిపోల నుంచి ప్రధాన రూట్లతోపాటు హైదరాబాద్ నుంచి స్పెషల్ సర్వీసులు నడపనుంది. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం, 16న వరలక్ష్మీ వ్రతం, 18 ఆదివారం సెలవు, 19న రాఖీ పౌర్ణమి ఇలా వరుస సెలవులు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం ఉన్నవారు స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ఈనేపథ్యంలో 14 నుంచి 19వ తేదీ వర కు ప్రత్యేక బస్సులు నడపనుంది. ఉమ్మడి జిల్లాలోని డిపోల ద్వారా జేబీఎస్ నుంచి 129 బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనుంది.

మంచిర్యాల డిపో నుంచి..

మంచిర్యాల డిపో నుంచి ప్రధాన రూట్లు లక్సెట్టిపేట, జన్నారం, చెన్నూర్, గోదావరిఖని-కరీంనగర్ వరకు ప్రస్తుత బస్సులకు అదనంగా తిప్పేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 150 బస్సుల్లో రాజధాని-03, ఏసీ లహరి-04, నాన్ ఏసీ లహరీ-04, సూపర్‌లగ్జరీ-24, ఎక్స్‌ప్రెస్-06, పల్లెవెలుగు-39, ప్రైవేట్ ఎక్స్‌ప్రెస్-15, ప్రైవేట్ పల్లెవెలుగు-54 బస్సులున్నాయి. ఇందులో 145 బస్సుల ద్వారా 61 వేల కి.మీ మేర బస్సులు తిప్పుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. 5 బస్సులు ఎప్పుడు స్పేర్‌లో ఉండనున్నాయి. రాఖీ పండుగ వేళ ఒక్క బస్సు కూడా డిపోలో ఉండకుండా రోడ్లపై రయ్‌రయ్‌మంటూ తిరుగనున్నాయి. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లిన వారందరూ ఇంటిబాట పట్టనున్నారు. హైదరాబాద్ రెగ్యులర్‌గా 38 బస్సులు నడుపుతున్నారు. రాఖీ, వరుస సెలవుల నేపథ్యంలో మంచిర్యాల డిపో నుంచి ఈనెల 14నుంచి 16వరకు మూడు, 17న 18, 18న 10, 19న 18 బస్సులు తిప్పనున్నారు.

ఆయా డిపోల నుంచి..

ఈనెల 14 నుంచి 19వరకు జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భైంసా, ఉట్నూర్ డిపోలు మినహాయిస్తే రద్దీ నేపథ్యంలో జేబీఎస్ నుంచి ఆదిలాబాద్‌కు ఆదిలాబాద్ డిపో బస్సులు 21, ఆసిఫాబాద్ డిపో బస్సులు 23, మంచిర్యాల డిపో బస్సులు, నిర్మల్ డిపోకు చెందిన 30 బస్సులు మొత్తం 129 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

మహాలక్ష్మి తర్వాత రాఖీ పండుగతో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేసింది. దీంతో మహిళల ఉచిత బస్సు ప్రయాణం రెట్టింపయింది. దీనికితోడు రాఖీ పండుగకు రద్దీ ఉండనుండటంతో ఆయా బస్‌స్టేషన్లలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. శ్రావణమాసం ఛాలెంజ్‌లో భాగంగా మహాలక్ష్మి టికెట్లతో సంబంధం లేకుండా మంచిర్యాల డిపోకు రూ.21 లక్షల ఆదాయం టార్గెట్ విధించారు. వరుస సెలవుల నేపథ్యంలో బస్సులు తిప్పడం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా అధికారులు నిర్ణయించారు.

ప్రత్యేక ఇన్సెంటివ్

మంచిర్యాల డిపోలో రోజుకు 61 వేల కి.మీ మేర బస్సులు రాకపోకలు సాగిస్తుండగా పండుగ నేపథ్యంలో మరో 6 వేల కి.మీ మేర అదనంగా బస్సులు నడపనున్నారు. ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఆడిషనల్‌గా విధులు నిర్వహించే కండక్టర్లకు కి.మీకి రూ.3 చొప్పున చెల్లించనున్నారు. ఉదాహరణకు ఆడిషనల్ 60 కి.మీ తిప్పితే రూ.3 చొప్పున 180 రూపేణా విధులు ముగియగానే చెల్లించనున్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం

రాఖీ సందర్భంగా ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. డిపో పరిధిలో హైదరాబాద్‌తోపాటు ప్రధాన రూట్లు కరీంనగర్, జన్నారం, ఆసిఫాబాద్, చెన్నూర్ రూట్లలో అదనపు బస్సులు నడపనున్నాం. జేబీఎస్ బస్‌స్టేషన్‌తోపాటు మంచిర్యాల డిపో వద్ద బస్సుల సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం.
– జనార్దన్, డిపో మేనేజర్, మంచిర్యాల

ఉత్తమ కార్మికులు వీరే..


ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికైన రాజలింగయ్య

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఉత్తమ కార్మికులను అధికారులు ఎంపిక చేసినట్లు జీఎం దేవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సింగరేణియన్‌గా పొట్ట రాజలింగయ్య (హెడ్ ఓవర్‌మెన్, శాంతిఖని), ఏరియా ఉత్తమ కార్మికులుగా కల్వల శంకర్ (జనరల్ మజ్దూర్, ఆర్కే-ఓసీ), ముద్దసాని చంద్రమోహన్ (ఈపీ ఆపరేటర్, ఆర్కే-ఓసీ), పల్లపు మల్లేశ్ (ఈపీ ఆపరేటర్, కేకే-ఓసీ), ముద్దసాని కోటయ్య (జనరల్ మజ్దూర్, కేకే-ఓసీ), మంద సమ్మయ్య (హమర్‌మెన్, కాసీపేట), సీహెచ్ రాజు (కోల్‌కట్టర్, కాసిపేట), గోలెం శ్రీనివాస్, (జనరల్ మజ్దూర్, కాసిపేట-2), గంగారపు వేణుగోపాల్ (ట్రామర్ కాసిపేట-2), బానోత్ భరత్ (మైనింగ్ సర్దార్, శాంతిఖని), జంగం శాకుమార్ (టెండాల్, శాంతిఖని), ఏ.రాజశేఖర్ (కోల్‌కట్టర్, కేకే-5), డి.మొగిలి (టింబర్‌మెన్, కేకే-5), కొదాటి మహేశ్వర్ (హెల్పర్, ఆర్కేపీ సీహెచ్‌పీ) ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉత్తమ సింగరేణియన్‌ను కొత్తగూడెంలో సీఎండీ బలరాం, ఏరియా ఉత్తమ కార్మికులను ఏరియాలో జీఎం దేవేందర్ సన్మానించనున్నారు.

శ్రీరాంపూర్ డివిజన్‌లో..


కె.భీరయ్య

శ్రీరాంపూర్: 77వ స్వాతంత్ర వేడుకల్లో భాగంగా సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్‌లో ఉత్తమ కార్మికులను ఎంపిక చేసింది. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన 19 మందిని ఉత్తమ కార్మికులుగా ఎంపిక చేసి గురువారం ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో వారిని సన్మానించనున్నారు. వీరిలో ఆర్కే 5 గని నుంచి కొట్టే మల్లేశం(ఎలక్ట్రీషన్), గొడుగు సమ్మయ్య (సపోర్ట్ మెన్), ఆర్కే 6 నుంచి సుదర్శన్ (టెండల్ సూపర్‌వైజర్), లక్ష్మయ్య (సపోర్ట్‌మెన్), ఆర్కే 7 నుంచి నాగరాజు (ఓవర్‌మెన్), దేవయ్య (లైన్‌మెన్), ఆర్కే న్యూటెక్ గని నుంచి సాంబయ్య (జనరల్ మజ్దూర్), భూమయ్య (ఎస్‌డీఎల్ ఆపరేటర్), ఎస్ఆర్పీ-1 గని నుంచి జి.వెంకటేశ్వర్‌రావు (డిప్యూటీ సూపరింటెండెంట్), ఈ.సమ్మయ్య (హాలేజ్ ఆపరేటర్), ఎస్సార్పీ 3, 3ఏ నుంచి డి.రామోజీ(గోపియా ట్రామర్), ఇందారం 1ఏ గని నుంచి సురేష్ బాబు (ఎస్‌డీఎల్ ఆపరేటర్), మహేశ్(ఫిట్టర్), ఇందారం ఓపెన్ కాస్ట్ గని నుంచి ఈశ్వర్ (ఈపీ ఫిట్టర్), జె.రమేశ్ (ఈపీ ఆపరేటర్), శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని నుంచి వెంకటేశ్వర్లు (ఫిట్టర్), గొల్ల సురేష్ (ఈపీ ఆపరేటర్), శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి కోటేశ్వరరావు (జనరల్ మజ్దూర్) ఉన్నారు.

కంపెనీస్థాయిలో కె.భీరయ్య..

వీరితోపాటు కంపెనీ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఉత్తమ కార్మికుల్లో శ్రీరాంపూర్ ఏరియా నుంచి కర్రె భీరయ్య ఎంపికయ్యారు. భీరయ్య ఆర్కే 6 గనిలో ఎస్‌డీఎల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొత్తగూడెంలో జరిగే స్వాతంత్ర వేడుకల్లో యజమాన్యం ఆయన్ను సన్మానించనుంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు-2024కు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో మెయిన్స్ శిక్షణ సన్నద్ధమయ్యేందుకు మెంటార్ గైడెన్స్‌తోపాటు ట్యాబ్, ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు యూపీఎస్సీ, సీఎస్సీ, ప్రిలిమినరీ పరీక్ష 2024లో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 7382620487, 7093466985 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న రాజిరెడ్డి

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో తాటికొండ చంద్రయ్య ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రయ్య తన భార్యతో కలిసి సోమవారం రాత్రి చెన్నూర్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లాడు. ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం వెలిగించి పోయారు. అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అప్పటికే బీరువాలో రూ.3.50లక్షలతోపాటు తులం బంగారం, 7 క్వింటాళ్ల బియ్యం, వెండిపట్ట గొలుసులు, సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.8లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ రంజిత్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి మంగళవారం పరిశీలించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న బిస్వనాథ్ బెహరా

శ్రీరాంపూర్: విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంఎస్(ఎలక్ట్రీకల్) బిస్వనాథ్ బెహరా తెలిపారు. మంగళవారం సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్‌లో ఎక్స్ ఆపరేటస్, ఓహెచ్ లైన్ల భద్రతపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ప్రమాదాలపై అవగాహన ఉండాలన్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను విశ్లేషిస్తే ఎందుకు జరిగాయో తెలిస్తాయని దానికి అనుగుణంగా మరోసారి ఆ తరహా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. వ్యక్తిగత పనిముట్లు, రక్షణ పరికరాలు తప్పని సరిగా వినియోగించాలన్నారు. ఏరియాలో తీసుకుంటున్న విద్యుత్ ప్రమాదాల నివారణ, రక్షణ చర్యలను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి వివరించారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ గుప్తా, ఏరియా ఎస్ఓటూజీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, శ్రీధర్, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, వీటీసీ మేనేజర్ రామారావు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ చెన్నూర్ కోర్టు జడ్జి రవి మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం..జైపూర్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా మంచిర్యాల వైపు నుంచి చెన్నూర్ వైపు వెళ్తున్న లారీని ఆపారు. డ్రైవర్ ఆర్కే గజానంద్‌కు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు రుజువైంది. చెన్నూర్ కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో ఈ మేరకు జడ్జి తీర్పు వెలువరించారు.

నకిలీ విలేకరిపై కేసు

జన్నారం: మండలంలోని పొనకల్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాన్ని ఓ పత్రికస్టాఫ్ రిపోర్టర్‌ను అని డబ్బులు డిమాండ్ చేసిన నకిలీ విలేకరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఈనెల 11న స్టాఫ్ రిపోర్టర్ అని, పత్రిక వార్షికోత్సవం సందర్భంగా తనకు రూ.5 వేలు ఇవ్వాలని రత్నం తిరుపతి డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే ఇబ్బంది పడుతానని బెదిరింపులకు పాల్పడ్డాడని కరస్పాండెంట్ మధుసూదన్ ఫిర్యాదు చేశాడు. నకిలీ విలేకరి తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి


చుక్కల దుప్పి మృతదేహం

సిర్పూర్(టి): కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతిచెందింది. సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ కథనం ప్రకారం.. సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ పరిధి పరిసర ప్రాంతాల్లో మంగళవారం చుక్కల దుప్పిని కుక్కలు వేటాడుతున్నాయనే సమాచారం అందింది. అటవీ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. చుక్కల దుప్పిని తీసుకుని సిర్పూర్(టి) పశువైద్యశాలకు వెళ్లి చికిత్స అందించారు. అనంతరం చీలపెల్లి అటవీప్రాంతంలో వదిలేందుకు వెళ్తుండగా మృతి చెందింది. అనంతరం ఖననం చేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీధర్‌చారి, ఎఫ్‌బీవో ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అన్నదమ్ముల గొడవ

- కూలీ డబ్బుల విషయంపై ఘర్షణ
- తమ్ముడి దాడిలో అన్న మృతి
- మోతుగూడలో ఘటన


సంజయ్‌కుమార్ మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: కూలీ డబ్బుల విషయంలో అన్నదమ్ములు గొడవపడ్డారు. ఈ ఘర్షణలో తమ్ముడి దాడిలో అన్న మృతిచెందాడు. మండలంలోని మోతుగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ సతీశ్ కథనం ప్రకారం..మోతుగూడలో ఆర్‌సీసీ పైపుల ఫ్యాక్టరీ కంపెనీలో బీహార్‌కు చెందిన 12 మంది పని చేస్తున్నారు. యజమాని వరప్రసాద్ సోమవారం వారికి కూలీ డబ్బులు ఇచ్చారు. డబ్బుల విషయమై రాత్రి 10 గంటలకు అన్నదమ్ములు గొడవపడ్డారు. తమ్ము డు అజయ్ సొంత అన్న సంజయ్‌కుమార్ (32) కొట్టాడు. కిందపడి తలకు పైపు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఆసిఫాబాద్ ప్రభు త్వ అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. యజమాని ఫి ర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెన్షన్ కోసం నిరీక్షణ

- 11వ వేతన ఒప్పందం ప్రకారం పెన్షన్ చెల్లించాలి
- 1700 మంది రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుచూపు
- పెండింగ్‌లో సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లు



గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం

శ్రీరాంపూర్: సింగరేణిలో కొందరు రిటైర్డ్ ఉద్యోగులు రివైజ్డ్ పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. 11వ వేతన ఒప్పంద కాలపరిధిలో దిగిపోయిన మరికొందరికి పెరిగిన వేతనంపై పెన్షన్, సీఎంపీఎఫ్ సెటిల్‌మెంట్ కాలేదు. ఈ జాప్యం కారణంగా వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 11వ వేతన ఒప్పందం కాలపరిమితితో వారు దిగిపోయినప్పటికి 10వ వేతన ఒప్పంద వేతనం మీదనే జమచేసి సీఎంపీఎఫ్ శాఖ అధికారులు పెన్షన్ చెల్లిస్తున్నారు. ఇలా శ్రీరాంపూర్‌లో 1700 మంది రిటైర్డ్ ఉద్యోగులు రివైజ్డ్ పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ కేసులు త్వరగా సెటిల్‌చేయాలని సీఎంపీఎఫ్ శాఖ, కంపెనీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. 11వ వేతన కాలపరిమితి 1-7-2021 నుంచి మొదలు కావల్సి ఉంది. కాని ఒప్పందం 23 నెలల ఆలస్యంగా జరిగింది. అమలు మరింత జాప్యమైంది. ఎప్పుడు అమలైన పాత తేదీ నుంచే లెక్కించి వేతనాలు ఏరియర్స్‌గా చెల్లిస్తారు. పెన్షన్ కూడా రివైజ్డ్ చేయాల్సి ఉంటుంది. దీనికితోడు నాటి ప్రభుత్వం 60 ఏళ్ల రిటైర్మెంట్ వయస్సు 61 ఏళ్లకు పెంచడం, పెరిగిన అదనపు సంవత్సరం సెటిల్‌మెంట్లను కంపెనీ ప్రత్యేకంగా చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ రెండు కారణాలతో 1-7-2021 నుంచి ఫిబ్రవరి 28, 2024 మధ్య దిగిపోయిన 1700 మందికి కొత్త వేతనాలపై పెన్షన్ రావడం లేదు. వారంతా పెరిగిన వేతనాల ప్రకారం తమ పెన్షన్‌ను రివైజ్డ్ చేసి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతోపాటు పెన్షన్ ఏరియర్స్ చెల్లించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి వీవీ స్టేట్‌మెంట్లను ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు తయారు చేసి గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్‌శాఖ అధికారులకు పంపించారు. త్వరలో ఇవి సెటిల్ అవుతాయని వారు పేర్కొంటున్నారు.

ఇంకా పాత పెన్షనే వస్తుంది



నేను 25-12-2021లో రిటైర్డ్ అయ్యాను. ఇది 11వ వేజ్‌బోర్డు పరిధిలోనే ఉన్న ఇప్పటికి 10వ వేతన ఒప్పందం ప్రకారమే పెన్షన్ ఇస్తున్నారు. 11వ వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనం మీద నాకు పెన్షన్ రివైజ్డ్ చేసి చెల్లించాలి. ఏరియర్స్ కూడా చెల్లించాలి. దీనివల్ల కనీసం రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు పెరుగుతాయి.
– వినయ్ ప్రశాంత్, రిటైర్డ్ ఉద్యోగి

రోడ్డు ప్రమాదం కేసులో వ్యక్తికి ఏడాది జైలు

నస్పూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ జడ్జి ఫస్ట్ క్లాస్ డి.ఉపనిషద్వని మంగళవారం తీర్పు వెలువరించారు. జులై 7, 2017లో కట్కూరి లింగయ్య.. పట్టణ పరిధిలోని నస్పూర్ గేట్ వద్ద 63వ జాతీయరహదారి దాటుతున్నాడు. ఆనందం ప్రైవేటు బస్సును అతివేగంగా వచ్చి లింగయ్యను ఢీకొని గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ లింగయ్య మృతిచెందాడు. అప్పటి సీసీసీ నస్పూర్ ఎస్సై దత్తాత్రి కేసు నమోదు చేశారు. పీపీ సహిన్ సుల్తానా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఈమేరకు జడ్జి తీర్పునిచ్చారు.

కంప్యూటర్ల చోరీ

కోటపల్లి: స్థానిక మోడల్ స్కూల్‌లో 7 కంప్యూటర్ల చోరీ జరిగింది. శని, ఆదివారం సెలవు కావడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేందర్ మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎస్టీపీపీలో 'హర్ ఘర్ తిరంగా'


జాతీయ జెండాలతో ర్యాలీ తీస్తున్న అధికారులు

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టీపీపీ ఇంచార్జీ ఈడీ, జీఎం ఎన్వీ.రాజశేఖర్‌రావు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్‌పర్మార్, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్‌లు జాతీయ జెండాలను ప్రజలకు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కేంద్రప్రభుత్వం, సింగరేణి సంస్థ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలని కోరారు. అధికారులు శ్రీనివాసులు, సుధాకర్, మధన్‌మోహన్, సముద్రాల శ్రీనివాస్, అజ్మీర తుకారం, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో పనిచేసి వివిధ డిపార్టుమెంట్లకు బదిలీపై వెళ్తున్న అధికారులకు ఐఎన్టీయూసీ నాయకులు సన్మానించారు. ఏరియా వర్క్ షాప్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వర్క్‌షాప్‌లో విధులు నిర్వహించి ఏరియా స్టోర్స్‌కు బదిలీ అయిన డీజీఎం మల్లయ్య, ఆర్కే 6 గని డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా పనిచేసి కార్పొరేట్ ఎడ్యుకేషన్ విభాగానికి బదిలీపై వెళ్తున్న సునీల్ కుమార్‌లను ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు వారిని శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు కలవేన శ్యామ్, గరిగే స్వామి, భీంరావు, ల్యాగల శ్రీనివాస్, ఏరియా నాయకులు పాల్గొన్నారు. కార్పొరేట్ ఎడ్యుకేషన్ విభాగానికి బదిలీ అయిన సునీల్ కుమార్‌ను శ్రీరాంపూర్ ఆర్కే 6 గనిపై అధికారులు ని మేనేజర్ ఈ.తిరుపతి, ఉద్యోగులు సన్మానించారు. గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, పిట్ ఇంజనీర్ శ్యాం కుమార్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సంఘం సదానందం పాల్గొన్నారు.



ఐఎంఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ


ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద మెడికల్ కాలేజీ విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

నిందితులను శిక్షించాలి

మంచిర్యాలటౌన్: కోల్‌కతాలోని పీజీ వైద్య విద్యార్థిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఐఎంఏ, ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు రమణ, జనరల్ సెక్రటరీ కెవిఎల్ఎన్ మూర్తి, ట్రెజరర్ కెఎంఎన్ శ్రీనివాస్ ఉన్నారు.